TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 81 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ బుధవారం | ఆగస్టు 05, 2026




## తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంచాలి

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్రం అనుమతులు ఇప్పించాలి
- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు వినతి

ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ ఎత్తును పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. బ్యారేజీ ఎత్తు పెంచినప్పటికీ మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రితో సమావేశమయ్యారు.

న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :

## మరోసారి వర్షాల జోరు..

### పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్ జారీ!



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గత రెండు వారాలుగా తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా రెండు రాష్ట్రాల్లోనూ వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ తరుణంలో వాతావరణ శాఖ మరోసారి రెండు తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన జారీ చేసింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో గురువారం వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు వాతావరణ శాఖలు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్‌లను జారీ చేశాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా ప్రకారం.. మరికొన్ని గంటల్లో హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్, ఖమ్మం, నిజామాబాద్ తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. సంగారెడ్డి జిల్లాలో ఉరుములు–మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉండటంతో ఆ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ జిల్లాల్లో సాయంత్రం 7 గంటల వరకు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ అయింది. వర్షాల సమయంలో గంటకు 40 కి.మీ. లోపు వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.


## హరీష్‌రావు తప్పుడు ప్రచారం మానుకోవాలి

### కాళేశ్వరం ముడుపుల లెక్క చెప్పాలి
### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బీఆర్ఎస్ నేత హరీష్‌రావు నిరాధార ఆరోపణలు, తప్పుడు ప్రచారం మానుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కట్టుకథలతో బట్టకాల్చి మీద వేసే రాజకీయాలు సరికాదని హితవు పలికారు. తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణలో తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణకు తీరని ద్రోహం చేసిన బీఆర్ఎస్ నేతలు, ముఖ్యంగా హరీష్‌రావు ముందుగా కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, ముడుపుల లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. జీఆర్ఎంబీ అజెండాపై స్పష్టత: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు అజెండాలో కొత్త అంశాలు ఏమీ లేవని, గత 12 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవే అభ్యంతరాలు చెబుతూ వస్తోందని తెలిపారు. తెలంగాణ రైతుల నీటి హక్కులను కాపాడటంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసానిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, వ్యతిరేకంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడటం ఆ పార్టీకి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. పోలవరం, పట్టిసీమ, రాయలసీమ ఎత్తిపోతల పథకాల పనులు గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనా కాలంలోనే జరిగాయని, అప్పుడు కనీసం నోరు మెదపని వారు ఇప్పుడు ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

## యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీల మోత?




- పెద్ద వ్యాపారులకే వర్తింపు!
- రూ.2 వేలు దాటిన పేమెంట్స్‌పై 0.3% నుంచి 0.5% వరకు ఛార్జీలు ఉండే అవకాశం
- సామాన్యులకు ఎలాంటి భారం ఉండదని స్పష్టత
- నిర్వహణ వ్యయాన్ని ఎవరో ఒకరు భరించాల్సిందేనన్న ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : దేశంలో కోట్లాది మంది నిత్యం ఉపయోగిస్తున్న యూపీఐ డిజిటల్ చెల్లింపుల విధానంలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ ఛార్జీలు విధించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్ యాక్ట్'లో సవరణలు చేస్తూ త్వరలోనే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టేందుకు కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, ఆగస్టు 05, 2026

# దురాశే సైబర్ నేరగాళ్లకు ఆయుధం..

## డీసీపీ ధార కవిత, ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్.రవి

## ప్రతి ఒక్కరూ పూర్తి అప్రమత్తతతో ఉండాలి




**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దురాశ, అవగాహన లేమిని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ పూర్తి అప్రమత్తతతో వ్యవహరిస్తేనే ఇటువంటి నేరాలను నివారించవచ్చని హనుమకొండ డీసీపీ ధార కవిత అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సిబ్బందికి సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి, డీసీపీ ధార కవిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ ధార కవిత మాట్లాడుతూ.. కంప్యూటర్లు, ఇంటర్నెట్, డిజిటల్ పరికరాల వినియోగం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా మాత్రమే సైబర్ నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు, తక్కువ ధరలకు వస్తువుల విక్రయం, ఆకర్షణీయమైన ఉద్యోగ అవకాశాలు, ఆన్‌లైన్ పెట్టుబడులపై భారీ లాభాలు వంటి ఆశాజనకమైన ఆఫర్లతో అమాయకులను వలలో వేసుకుంటున్నారని హెచ్చరించారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ.. నేడు చదువుకున్న వారు, ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగులు సైతం సైబర్ నేరగాళ్ల మాయమాటలకు మోసపోతుండటం ఆందోళనకరమన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయనే ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి సైబర్ భద్రతా ప్రమాణాలపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సైబర్ నేరాల నివారణకు తాము ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటామని, తోటి వారికి అవగాహన కల్పిస్తామని అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, హనుమకొండ, కాజీపేట ఏసీపీలు పింగిలి ప్రశాంత్ రెడ్డి, నరసింహారావు, డీఆర్డీవో మేన శ్రీనుతో పాటు పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంచాలి

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్రం అనుమతులు ఇప్పించాలి
- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు వినతి



**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణ ఎత్తును పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. బ్యారేజీ ఎత్తు పెంచినప్పటికీ మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రితో సమావేశమయ్యారు.

### ప్రధానికి రాసిన లేఖ ప్రస్తావన:

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరిస్తూ గతంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖను, దానిపై పీఎంవో స్పందించి జలశక్తి శాఖకు పంపిన విషయాన్ని సీఎం ఈ సందర్భంగా గుర్తుచేశారు. తుమ్మిడిహెట్టి వద్ద గతంలో 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు. అయితే 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు ఎత్తు పెంపుపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం నిర్వహించిందని వివరించారు. సీడబ్ల్యూ పీఆర్ఎస్ అధ్యయనం ప్రకారం.. 148 మీటర్లయినా, 152 మీటర్లయినా ముంపులో పెద్దగా తేడా ఉండదని, అందులోనూ 50 శాతం ముంపు నదీ గర్భం (రివర్ బెడ్)లోనే ఉంటుందని స్పష్టమైందని తెలిపారు.

### గ్రావిటీ ద్వారా నీటి సరఫరా:

148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే గ్రావిటీ ద్వారా అవసరమైన నీటి సరఫరా సాధ్యం కాదని, విద్యుత్ వినియోగ భారాన్ని తగ్గించుకోవాలంటే 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో నిర్మాణం చేపట్టాలని, ఇందుకు మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటి వసతి మెరుగవుతుందని వివరించారు.

### కేంద్ర మంత్రి సానుకూల స్పందన:

పీఎంవో నుంచి లేఖ అందిందని పేర్కొన్న జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్.. ఈ అంశంపై మొదట కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్ర స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చలు ప్రారంభిస్తామని తెలిపారు. ఆ తర్వాత ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ. శ్రీధర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీల మోత?.

- పెద్ద వ్యాపారులకే వర్తింపు!
- రూ.2 వేలు దాటిన పేమెంట్స్‌పై 0.3% నుంచి 0.5% వరకు ఛార్జీలు ఉండే అవకాశం
- సామాన్యులకు ఎలాంటి భారం ఉండదని స్పష్టత
- నిర్వహణ వ్యయాన్ని ఎవరో ఒకరు భరించాల్సిందేనన్న ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా


**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశంలో కోట్లాది మంది నిత్యం ఉపయోగిస్తున్న యూపీఐ డిజిటల్ చెల్లింపుల విధానంలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ ఛార్జీలు విధించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్ యాక్ట్'లో సవరణలు చేస్తూ త్వరలోనే పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టేందుకు కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. గతంలోనూ ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చినప్పటికీ వ్యతిరేకత రావడంతో కేంద్రం వెనక్కి తగ్గింది. అయితే, తాజాగా మరోసారి ఎండీఆర్ ఛార్జీల విధింపు దిశగా అడుగులు పడుతుండటంతో త్వరలోనే ఇవి అమల్లోకి వచ్చే అవకాశాలున్నాయి.

### పెద్ద వ్యాపారులకే పరిమితం..

ఈ తాజా నిబంధనల ప్రకారం.. రూ. 2 వేలకు మించి జరిగే డిజిటల్ లావాదేవీలపై మాత్రమే ఈ ఛార్జీలు వర్తించనున్నాయి. ముఖ్యంగా అధిక టర్నోవర్ ఉన్న పెద్ద వ్యాపారులకు మాత్రమే ఎండీఆర్ వర్తిస్తుందని తెలుస్తోంది. రూ. 2 వేలకు లోపు లావాదేవీలు మరియు సామాన్యులు, వ్యక్తుల మధ్య జరిగే సాధారణ చెల్లింపులు ఎప్పటిలాగే పూర్తిగా ఉచితంగా కొనసాగుతాయి. దీనివల్ల సామాన్యులపై ఎలాంటి ఆర్థిక భారం పడదని స్పష్టమవుతోంది. అయితే, యూపీఐ లావాదేవీలను ప్రాసెస్ చేసేందుకు బ్యాంకులు మరియు పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లకు వ్యాపారులు కొంత మొత్తంలో ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఈ నిర్వహణ భారాన్ని బ్యాంకులు, పేమెంట్ అగ్రిగేటర్లే భరిస్తూ వస్తున్నాయి.

### ఆర్బీఐ గవర్నర్ స్పందన ఇదే..:

ఈ అంశంపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందిస్తూ.. దీనిపై ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు చర్య అవుతుందని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని తెలిపారు. ఏదేమైనప్పటికీ, యూపీఐ వంటి అత్యంత భారీ డిజిటల్ పేమెంట్స్ వ్యవస్థను సజావుగా నిర్వహించడానికి, మరింత వేగవంతం చేయడానికి




మరియు సాంకేతిక భద్రతను పెంచడానికి భారీగా ఖర్చు అవుతుందని, ఆ నిర్వహణ వ్యయాన్ని ఎవరో ఒకరు భరించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. రిజర్వ్ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం ముగిసిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. త్వరలో కేంద్రం తీసుకునే స్పష్టమైన నిర్ణయంపైనే ఈ ఛార్జీల విధింపు ఆధారపడి ఉంది.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, ఆగస్టు 05, 2026

# తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం




- హైదరాబాద్ డీఎంహెచ్‌వో డా. పుట్ల శ్రీనివాస్
- ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. శిశువు జీవితానికి తల్లిపాలు ఉత్తమ ప్రారంభమని, ఇవి సంపూర్ణ ఆహారమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆగస్టు 7 వరకు ఈ వారోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టడం, మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, రెండేళ్ల వరకు అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలు కొనసాగించడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. శిశువుకు రక్షణ: తల్లిపాలలో రోగ నిరోధక శక్తి మెండుగా ఉంటుందని, విరోచనాలు, న్యుమోనియా, ఇన్ఫెక్షన్లు, అలర్జీలు తగ్గుతాయని



తెలిపారు. మెదడు ఎదుగుదల మెరుగుపడుతుందని, భవిష్యత్‌లో ఊబకాయం, మధుమేహం, రక్తపోటు వంటి ముప్పులు తగ్గుతాయని అన్నారు. తల్లిబిడ్డల మధ్య భావోద్వేగ బంధం బలపడుతుందని చెప్పారు. పుట్టిన వెంటనే వచ్చే పసుపు రంగు ముర్రుపాలలో ఇమ్యూనోగ్లోబులిన్, లాక్టోఫెరిన్, ప్రొటీన్లు, విటమిన్ ఎ, విటమిన్ ఇ, జింక్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయని, ఇది శిశువుకు మొదటి టీకాగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. తల్లికి ఆరోగ్య ప్రయోజనాలు: పాలు ఇవ్వడం వల్ల తల్లులకు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లు రాకుండా రక్షణ లభిస్తుందని తెలిపారు. ప్రసవానంతర రక్తస్రావం తగ్గడంతో పాటు మధుమేహం, అధిక బరువు, మానసిక ఒత్తిడి దరిచేరవని, గర్భాశయం సాధారణ స్థితికి రావడానికి సహాయపడుతుందని, తాత్కాలిక కుటుంబ నియంత్రణ సాధనంగా కూడా పనిచేస్తుందని సూచించారు. ఆధునిక జీవనశైలి, ఉద్యోగాలు, సోషల్ మీడియా ప్రభావం వల్ల కొందరు తల్లిపాలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పౌడర్ డబ్బా పాలు ఎట్టి పరిస్థితుల్లోనూ తల్లిపాలకు ప్రత్యామ్నాయం కాలేవని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే అపోహలను నమ్మవద్దని, ప్రతి తల్లీ గర్వంగా తమ శిశువుకు తల్లిపాలు పట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డా.సుధీర్ (ప్రోగ్రామ్ ఆఫీసర్ అండ్ ఇన్‌స్పెక్షన్స్), డా.శ్రీధర్ (జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి), డా.ఆస్రా కౌసర్ (గోల్కొండ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్), డా. అమీర్ సిద్దికి (ఆర్ఎంఓ), డా.మురళీధర్ (ఎస్పీహెచ్‌వో), వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది, తల్లులు, గర్భిణీ స్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డాక్టర్ రఘును కలిసిన సీపీఐ నేతలు


- ‘ఛలో ఢిల్లీ’ కార్యక్రమానికి మద్దతకై భేటి
- కేంద్ర వ్యతిరేక పోరులో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి



**కోరుట్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆగస్టు 6 నుంచి 14 వరకు చేపట్టనున్న పాదయాత్రలు, సెప్టెంబర్ 1న నిర్వహించ తలపెట్టిన ‘ఛలో ఢిల్లీ’ కార్యక్రమానికి మద్దతు తెలపాలని కోరుతూ సీపీఐ నేతలు తెలంగాణ రక్షణ సమితి కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షులు డాక్టర్ రఘును మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను డాక్టర్ రఘుకు వివరించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, విపరీతంగా పెరుగుతున్న ధరలను అరికట్టాలని, దేశ ప్రజలందరికీ సార్వత్రిక విద్య, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయడంతో పాటు, రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. కార్మికుల హక్కులను పరిరక్షించడం, ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్ పద్ధతిని పునరుద్ధరించి నిజమైన ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, దళిత, ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, ఆకృత్యాలను అరికట్టాలని వారు పేర్కొన్నారు. ఈ ప్రజా పోరాటంలో అందరూ భాగస్వామ్యమై తమకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సెక్రటరీ చెన్న విశ్వనాథం, బీడీ కార్మిక సంఘం రాష్ట్ర సెక్రటరీ సుతారి రాములు, బీడీ కార్మిక సంఘం నాయకురాలు యెన్నం రాధ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రాంబాబు, సీపీఐ మెట్‌పల్లి టౌన్ సెక్రటరీ ఎండీ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆషాఢ మాస బోనాల మహోత్సవాలు

## పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం కళ్యాణ్ నగర్‌లోని బి.ఆర్.సి.ఆర్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రాంగణంలో కొలువైన శ్రీ శ్రీ శ్రీ వింధ్యవాసిని మాత దేవాలయంలో ఆషాఢ మాస బోనాల మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, తెలంగాణపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సత్కరించారు.



# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**జమ్మికుంట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జమ్మికుంట మండలం మడిపల్లి, సైదాబాద్ గ్రామాల సర్పంచులు తిరుమల–వెంకటేష్, పుప్పాల రాజారం సూచించారు. బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఆయా గ్రామపంచాయతీ ఆవరణల్లో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించారు. జమ్మికుంట ఆదిత్య–అమృత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, హనుమకొండ శ్రీలక్ష్మీనరసింహ లూమినస్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టి, మొత్తం 220 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆరోగ్యమే మహాభాగ్యమనే భావనతో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పెట్టాలని పిలుపునిచ్చారు. వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, ప్రముఖ గైనకాలజిస్టులు డాక్టర్ గ్రీష్మ, డాక్టర్ తేజస్విని, డాక్టర్ సంకీర్తన మాట్లాడుతూ.. ఆధునిక జీవనశైలి కారణంగా మానసిక ఒత్తిడి పెరిగి గుండెపోటు, మెదడు పక్షవాతం వంటి ప్రాణాంతక వ్యాధులు మునుపటి కంటే ఎక్కువగా వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమతుల్య



ఆహారం తీసుకోవడం, ప్రతిరోజూ నడక, వ్యాయామం చేయడం, తగినంత మంచినీరు తాగడం ద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్య విషయాల్లో మరింత అవగాహనతో ఉండాలని కోరారు. బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ.. ప్రజలు పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 14 సెంటర్ల పరిధిలోని 180 గ్రామాల్లో నిరంతరం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు దాదాపు రూ. 2 కోట్ల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్లు కె. సుమలత, ఏ.స్వాతి, ఆసియా, ఉప సర్పంచులు కస్తూరి శ్రీనాథ్, ఉప్పమల్ల తిరుపతి, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులు అంజిరెడ్డి, అంకుస్, మేనేజింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, పీఆర్‌వోలు రఫిక్, దుర్గాప్రసాద్, సంపత్ రెడ్డి, రమేష్, భిక్షపతి, రాజేష్, ఆస్పత్రి సిబ్బంది అనిల్ రావు, శ్రావణ్, రంజిత్, పూజ, సంతోషిని, అనూష, శృతి, భారతి, కృష్ణవేణి, ప్రసన్నతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళా విద్యతోనే సమాజ అభివృద్ధి

**➲ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్**




**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందేభారత్ :** "ఒక స్త్రీ విద్యావంతురాలైతే ఆమె కుటుంబాన్నంతా విద్యావంతులుగా తీర్చిదిద్దుతుందని, సమాజ అభివృద్ధికి మహిళా విద్యే బలమైన పునాది" అని ప్రముఖ సామాజికవేత్త, 'ఐ లవ్ రీడింగ్ – ఐ లైక్ లైబ్రరీ' కార్యక్రమం వ్యవస్థాపకుడు నిమ్మల శ్రీనివాస్ పేర్కొన్నారు. 'ఐ లవ్ రీడింగ్ – ఐ లైక్ లైబ్రరీ' కార్యక్రమంలో భాగంగా హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కవితకు విలువైన ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలతో పాటు నీట్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ.. చదివిన పుస్తకాలను తూకానికి అమ్మివేయకుండా, అవసరమైన పేద విద్యార్థులకు అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని అన్నారు. ప్రతి ఇంటా పుస్తకాలను పంచుకునే సంస్కృతి పెంపొందితే పఠనాభిరుచి పెరిగి, సమాజంలో విజ్ఞాన వికాసానికి దోహదపడుతుందని తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఇటువంటి పుస్తకాల దానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ కవిత మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 'ఐ లవ్ రీడింగ్ – ఐ లైక్ లైబ్రరీ' పేరుతో చేపడుతున్న పుస్తకాల సేకరణ, పంపిణీ కార్యక్రమం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి వినూత్న కార్యక్రమాల వల్ల ఎంతోమంది విద్యార్థినులు ఉన్నత విద్య లక్ష్యాలను సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ అజయ్ కుమార్, అధ్యాపకులు శిరీష, స్వామి అరుణ శ్రీ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా విద్యార్థుల ప్రమాణ స్వీకరణోత్సవం

**◆ తుషార పాఠశాలలో వేడుక**

**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, పోటీ తత్త్వాన్ని పెంపొందించేందుకు తుషార పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన నాయకత్వ బృంద ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పాఠశాలలో ఏర్పాటు చేసిన నాలుగు గ్రూపులకు ఒక్కొక్కరు చొప్పున నాయకుడు, సహనాయకుడిని ఎంపిక చేశారు. అలాగే ప్రాథమిక తరగతుల నుండి కూడా ఒక నాయకుడు, సహనాయకుడిని నియమించారు. విద్యార్థులకు మరింత బాధ్యతలు అప్పగించేలా రేడియో, పాఠశాల మ్యాగజిన్, ఆటల పోటీలు, లైబ్రరీ, సాంస్కృతిక కార్యక్రమాలు, విజ్ఞాన విశాల వంటి ఏడు విభాగాలతో మంత్రి మండలిని ఏర్పాటు చేశారు.







ప్రతి మంత్రిత్వ శాఖకు ఒక కార్యదర్శి, ఉప కార్యదర్శి, సహాయ కార్యదర్శులను కేటాయించారు. ఈ బాధ్యతల ద్వారా విద్యార్థులు పాఠశాల కార్యక్రమాలను నిర్వహిస్తూ తమలో నిర్వహణా సామర్థ్యాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి చక్కటి అవకాశం లభిస్తుంది. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ బి. రమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు శాఖల బాధ్యతలను అప్పగించి అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మేజర్ నరేందర్, వైస్ ప్రిన్సిపల్ శ్రీమతి సుమ నూతన బాధ్యులకు పట్టాలు, టోపీలను అలంకరింపజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.100 కోట్లతో రోడ్ల అభివృద్ధి

**◆ కాంగ్రెస్ నాయకులు జగ్గారెడ్డి, నిర్మల**

**సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సంగారెడ్డి నియోజకవర్గంలో రూ.100 కోట్ల భారీ నిధులతో 83 కిలోమీటర్ల మేర కొత్త రోడ్ల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జగ్గారెడ్డి, నిర్మల తెలిపారు. త్వరలోనే ఈ పనులను ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని వెల్లడించారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో వారు ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కనీసం పాడైపోయిన రోడ్లకు రెన్యువల్ కూడా చేయించలేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో తమ హయాంలో వేసిన రోడ్లనే ప్రజలు ఇప్పటికీ ఉపయోగిస్తున్నారని, పదేళ్లుగా వాటి మరమ్మతులను గాలికొదలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన మార్గాలు, గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలను అనుసంధానించేలా నూతన రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే పెండింగ్ బిల్లుల విషయమై సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడి త్వరలోనే ఇప్పించేలా చొరవ చూపుతానని స్పష్టం చేశారు. ఈ నిధులతో మొత్తం 83 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేయనుండగా.. ఇందులో 29 కిలోమీటర్లు ఆర్ అండ్ బీ రోడ్లు, 54 కిలోమీటర్లు పంచాయతీరాజ్ రోడ్లు ఉన్నాయి. ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి–65 నుంచి వయా లక్డారం, బ్యాతోల్ మీదుగా ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామం వరకు 6.20 కి.మీ., జాతీయ రహదారి–65 నుంచి పరివార్ దాబా వద్ద ప్రారంభమై ఇస్మాయిల్ ఖాన్ పేట వరకు 6.50 కి.మీ., పెద్దాపూర్ నుంచి అనంత సాగర్ వయా తొగర్ పల్లి, అలియాబాద్, కొండాపూర్, మారేపల్లి వరకు 16.10 కి.మీ., పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి–65 నుంచి చిమ్నాపూర్ తండా వరకు – 6.67 కి.మీ., సంగారెడ్డి పట్టణంలోని జేసీ బంగ్లా నుంచి మల్కాపూర్ ఎక్స్ రోడ్డు వయా రాజంపేట వరకు – 3.73 కి.మీ., సంగారెడ్డి నుంచి తాళ్లపల్లి వరకు – 1.64 కి.మీ., శంకర్ పల్లి రోడ్డు నుంచి చేర్యాల వరకు – 1.97 కి.మీ., కంది మండలం మామిడిపల్లి నుంచి తున్కిల తండా వయా గొల్లగూడెం తండా వరకు – 1.73 కి.మీ., కంది మండలం ఎర్దనూరు నుంచి ఇస్మాయిల్ ఖాన్ పేట వరకు – 1.58 కి.మీ., శంకర్ పల్లి రోడ్డు నుంచి కంది మండలంలోని కలివేముల, చెర్లగూడెం వరకు – 2.76 కి.మీ., సదాశివపేట మండలం జాతీయ రహదారి–65 నుంచి మెలిగిరిపేట వయా ఆరూరు వరకు – 2.95 కి.మీ., సదాశివపేట నుంచి మాచిరెడ్డిపల్లి వయా వెంకటపూర్ వరకు – 5.72 కి.మీ., అనంత సాగర్ నుంచి సదాశివపేట పట్టణం వయా రేజింతల్ మీదుగా – 3.63 కి.మీ., సదాశివపేట మండలంలోని మోమిన్ పేట రోడ్డు నుంచి అనంత సాగర్ వరకు – 4.52 కి.మీ., కొండాపూర్ మండల కేంద్రం నుంచి ఎదురుగూడెం వరకు – 2.35 కి.మీ., కొండాపూర్ మండలం గొల్లపల్లి నుంచి పరమేశ్వర గుట్ట వరకు – 2.87 కి.మీ., కొండాపూర్ మండల కేంద్రం నుంచి నాగ్ సాన్ పల్లి వరకు – 1.15 కి.మీ., కొండాపూర్ మండలం మారేపల్లి నుంచి సీహెచ్ కోనాపూర్ వరకు – 10.50 కి.మీ. అభివృద్ధి చేయనున్నారు.



# జవహర్ నగర్ డంపుయార్డుపై కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశా

**పార్లమెంట్‌లో ఎంపీ ఈటల రాజేందర్**



**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హైదరాబాద్‌లోని జవహర్ నగర్ డంపుయార్డు సమస్యపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ తెలిపారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ డంపుయార్డు వల్ల చుట్టుపక్కల ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. పెరిగిన జనాభా – ముప్పేట దాడి: హైదరాబాద్ జనాభా 30 లక్షలుగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన జవహర్ నగర్ డంపుయార్డులోనే, నేడు రెండు కోట్ల మంది జనాభాకు సంబంధించిన చెత్తను ఒక్కచోటే వేస్తున్నారని ఈటల ఆందోళన వ్యక్తం చేశారు. గుట్టలుగా పేరుకుపోయిన చెత్త వల్ల 40 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, లక్షల మంది ఆరోగ్యం దెబ్బతిని సంపాదించినదంతా ఆసుపత్రులపాలే ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోయారు. ఈ సమస్యపై కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఒకే దగ్గర 10 వేల మెట్రిక్ టన్నుల చెత్త వేయడం శ్రేయస్కరం కాదని, అక్కడ ఒక్క కిలో చెత్త కూడా వేయకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరినట్లు వెల్లడించారు. వాయు, నీటి కాలుష్యం లేకుండా జీరో పొల్యూషన్ పద్ధతిలో చెత్తను రీసైకిల్ చేయించాలని విజ్ఞప్తి చేశానన్నారు. ఢిల్లీ లాంటి నగరాల్లో చెత్తను మేనేజ్ చేస్తున్నట్లుగానే, హైదరాబాద్‌లోనూ అదే పద్ధతులు అవలంబించేలా తగిన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు ఈటల తెలిపారు. అక్కడ ఎలక్ట్రిసిటీ జనరేషన్ స్టేషన్ ఉన్నప్పటికీ అది పనిచేస్తుందో లేదో తెలియదని, ఎలాంటి పర్యవేక్షణ లేదని విమర్శించారు. దాని సామర్థ్యం 3,500 మెట్రిక్ టన్నులు కాగా, అక్కడకు వస్తున్నది మాత్రం 10 వేల మెట్రిక్ టన్నులని పేర్కొన్నారు. ఈ అంశంపై తాను గతంలో సుప్రీంకోర్టులో కేసు వేసినట్లు, అప్పట్లో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి కూడా కేసు వేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆయన ముఖ్యమంత్రి అయ్యినప్పటికీ డంపుయార్డు సమస్యపై ఇప్పటివరకు ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని ఈటల అసంతృప్తి వ్యక్తం చేశారు.